క్లుప్తంగా

వాహనాల తనిఖీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక టోల్‌ప్లాజా వద్ద పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. జగ్గయ్యపేట-1 ఎస్‌ఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు నాలుగు గంటల పాటు వాహనాలను తనిఖీ చేశారు.

రేపు ఆలయ భూముల కౌలువేలం

నందిగామ రూరల్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలోని చెన్నకేశవస్వామి, వీరులపాడు మండలం జయంతి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయాలకు చెందిన భూములకు ఈ నెల తొమ్మిదిన టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. జయంతి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి చెందిన 15.26 ఎకరాలకు ఉదయం 10గంటలకు, దాములూరు చెన్నకేశవస్వామి వారి ఆలయానికి చెందిన 7.26 ఎకరాలకు సాయంత్రం మూడు గంటలకు ఆయా ఆలయాల ఆవరణలో కౌలువేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగల రైతులు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కోహెన్స్ కర్మాగారంలో మాక్ డ్రిల్



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కోహెన్స్ ఫార్మా కర్మాగారంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాదాపు మూడు గంటలపాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల సమయంలో కార్మికులను రక్షించే అంశంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థి

నందిగామ టౌన్: జాతీయ స్థాయి క్రీడా పోటీలలో నందిగామ ప్రాంత విద్యార్థులు ప్రతిభ చూపడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. లాక్రోస్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన తపస్య పాఠశాల విద్యార్థి ఓర్సు వెంకటేశ్వరరాజ్‌ను బుధవారం ఆమె అభినందించారు. ఇటీవల ఆగ్రాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థి వెంకటేశ్వరరాజ్ బ్రాంచ్ మెడల్ గెలుచుకోవడం హర్షణీయమంటూ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శాఖమూరి అమరకృష్ణ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్‌పై అవగాహన



జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. శిబిరంలో భాగంగా ఉపాధ్యాయుడు ఎన్. దాసు బుధవారం విద్యార్థులకు మ్యాథమ్యాటిక్స్, పజిల్స్ చేయడంపై అవగాహన కల్పించారు. బీడీసీ మల్లిక చిన్నారులకు పేపర్ క్రాఫ్ట్ ద్వారా బొకేలు తయారుచేసే విధానం నేర్పించారు. లైబ్రేరియన్ ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

కొణకంచి(పెనుగంచిప్రోలు): వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం మాక్ డ్రిల్‌పై అవగాహన నిర్వహించారు. యోగా శిక్షకులచే యోగాసనాలపై, మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. పాటలు పాడించడంతోపాటు ఆటలు ఆడించారు. గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, గూడపు రామారావు, యర్రం భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక అద్దాలబజారులో వేంచేసియున్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చింతా శేషానందం, బండారు రవి, కర్లపాటి కొండ, సూరె రాము, మద్దుల ఉమా పాల్గొన్నారు. అదేవిధంగా ముక్త్యాల రోడ్‌లోని స్టీల్ కొట్ల సెంటర్‌లో స్థానిక వాసవి సేవా సమితి వారి ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. యన్నాకుల రాంబాబు, కె.రమేష్, పేరూరి నరసింహారావు, పెనుగొండ రామకృష్ణ, వాసా నాగమణి పాల్గొన్నారు.

అకాల వర్షం..అపార నష్టం

- ఈదురుగాలులతో కూడిన వర్షానికి నేలవాలిన మామిడి, అరటి తోటలు
- విరిగిపడిన విద్యుత్, ధ్వజస్తంభాలు
- కల్లాల్లో తడిచిన ధాన్యం, మొక్కజొన్నలు, మిర్చి
- రైతులకు తీరని నష్టం



అకాల వర్షం ధాటికి లింగాలపాడు సమీపంలో నేలవాలిన అరటి తోట



కంచలలో ఈదురు గాలులకు విరిగిపడిన మామిడి చెట్లు

కంచికచర్ల/నందిగామరూరల్: నందిగామ నియోజకవర్గంలో మంగళవారం రాత్రి కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. గంటకుపైగా ఉరుములు, మెరుపులతో కూడిన ఈ అకాలవర్షం రైతులకు తీరని నష్టం మిగిల్చింది. బలమైన ఈదురుగాలులతో కూడిన ఈ వర్షం ధాటికి నందిగామ మండలంలోని లింగాలపాడులో అరటి తోటలు నేలవాలగా, కంచలలో మామిడితోటలు దెబ్బ తిన్నాయి. మామిడికాయలు నేలరాలడంతోపాటు పలుచోట్ల చెట్లు కూడా నేలకొరిగాయి. డివిజన్‌లో 53.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. నందిగామలో 19.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, వీరులపాడులో 9.2 మి.మీ, కంచికచర్లలో 6.2 మి.మీ, చందర్లపాడులో 5.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

తడిసిన ధాన్యం, మిర్చి..

కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న, మిర్చి వర్షం ధాటికి తడిసిపోయాయి. పట్టాలు కప్పి ఉంచినప్పటికీ కింద నుంచి వర్షపునీరు వెళ్లడంతో వరిధాన్యం, మొక్కజొన్నలు తడిసిపోయాయి. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో రహదారులపై చెట్లు పడిపోవటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగి రోడ్లపై పడటంతో వాహనాల రాకపోకలకు అవరోధం ఏర్పడింది. గాలివాన బీభత్సంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కంచికచర్ల మండలంలోని గండేపల్లిలో ఓ ఇంటిపై కొబ్బరి చెట్టు పడి ప్రహరీ గోడ పూర్తిగా ధ్వంసమైంది. కీసరలో తాటిచెట్టుపై పిడుగుపడి పూర్తిగా కాలిపోయింది. నందిగామ నుంచి చందర్లపాడు వెళ్లే రహదారిలో సుబాబుల్ చెట్లు పడటంతో ట్రాఫిక్‌కు అవరోధం ఏర్పడింది. నందిగామ నుంచి కోనాయపాలెం వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభం నేలకూలడంతో రాకపోకలు నిలిచిపోవడంతోపాటు ప్రయాణికులు ఆందోళన చెందారు. విద్యుత్ శాఖాధికారులు అక్కడకు చేరుకుని మరమ్మతులు నిర్వహించారు. చందర్లపాడు మండలం ఏటూరు, తోటరావులపాడు గ్రామాల్లోని విఘ్నేశ్వర స్వామి వారి ఆలయాల్లో ధ్వజస్తంభాలు నేలకొరిగాయి. కంచికచర్ల మండలంలో లారీలకు ఎత్తిన వరి ధాన్యం బస్తాలు కూడా వర్షానికి తడిసిపోయాయి. తడిసిన వరి ధాన్యాన్ని, మిర్చి పంటను చూసి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వరిధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు కనీసం గోనెసంచులు కూడా ఇవ్వకపోవడంతో ఇలా అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని రైతులు చెబుతున్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



కీసర నుంచి చందర్లపాడు వెళ్లే రోడ్డుపై విరిగిన చెట్టుతో మూసుకుపోయిన రోడ్డు



కీసర సమీపంలో తడిచిన మిర్చిని ఆరబెడుతున్న రైతులు

లింగాల కాజ్‌వే మరమ్మతులు ప్రారంభం



లింగాల కాజ్‌వేపై కొలతలు తీస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ పరుశురాముడు

లింగాల(వత్సవాయి): గతేడాది సెప్టెంబర్ నెలలో సంభవించిన వరదలకు దెబ్బతిన్న లింగాల కాజ్‌వే మరమ్మతు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. మరమ్మతు పనులకు సంబంధించిన కొలతలు వేశారు. వరదలకు కాజ్‌వే భారీగా దెబ్బతినడంతో కొద్దిరోజులపాటు రాకపోకలు కూడా నిలిచిపోయాయి. తాత్కాలిక మరమ్మతుల అనంతరం రాకపోకలను పునరుద్ధరించినప్పటికీ తొమ్మిది నెలలుగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోలేదు. కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు సైతం ఆందోళన చేశారు. ఈక్రమంలో కాజ్‌వే మరమ్మతులను ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. ఈ పనుల కోసం ఎస్‌డీఎంఎఫ్ నిధులు రెండు కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ డీఈ పరుశురాముడు తెలిపారు. కల్వర్టు కట్టడంతోపాటు పైపులైన్ వేసి కాజ్‌వే మొత్తం మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. మరమ్మతుల నేపథ్యంలో రెండు నెలలపాటు కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు డీఈ తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు...

కాజ్‌వే మరమ్మతుల దృష్ట్యా అధికారులు వాహనాల రాకపోకలను దారిమళ్లించారు. వైరా వైపు వెళ్లే వాహనాలు మక్కపేట నుంచి పెనుగంచిప్రోలు, వేమవరం, వత్సవాయి మీదుగా వైరా వెళ్తాయి. వైరా నుంచి వచ్చే వాహనాలు కూడా వత్సవాయి, వేమవరం, పెనుగంచిప్రోలు, మక్కపేట మీదుగా జగ్గయ్యపేట వెళ్లాలని అధికారులు సూచించారు. ఈ మార్పును వాహనచోదకులు, ప్రయాణికులు, ప్రజలు గమనించాలని కోరారు.

ఘన జీవామృతంతో భూమి సారవంతం



ఘన జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ ట్రైనర్లు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఘన జీవామృతంతో భూమి సారవంతంకావడంతోపాటు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం జగ్గయ్యపేట డివిజన్ మాస్టర్ ట్రైనర్ వన్నూరప్ప పేర్కొన్నారు. అనిగండ్లపాడులో బుధవారం ఆయన గ్రామరైతులకు ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 500కిలోల ఘనజీవామృతం తయారీ కోసం 500 కిలోల దేశీ ఆవుపేడ, 10 కిలోల నల్లబెల్లం, 10 కిలోల శనగపిండి, కొంచెం పుట్టమట్టి బాగా కలిపాలన్నారు. అనంతరం ఆ మిశ్రమాన్ని చిన్నచిన్న ముద్దలుగా తయారుచేసుకుని గోనెసంచిపై ఉంచి వారంరోజులపాటు నీడన ఆరబెట్టాలన్నారు. ఇలా తయారైన ఘన జీవామృతాన్ని పొడిచేసి ఏపంటకైనా ఆఖరి దుక్కిలో వేసుకోవచ్చన్నారు. ఘన జీవామృతంతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ట్రైనర్ చౌడప్ప, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వాణి, రాజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ హర్షిస్తూ బీజేపీ నేతల ర్యాలీ



గాంధీ సెంటరులో జాతీయ పతాకాలతో హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

నందిగామరూరల్: పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టి ద్వారా భారతప్రభుత్వం పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా నిర్వహించడాన్ని హర్షిస్తూ ఆపార్టీ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పతాకాలతో నందిగామ ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. ఇండియా జిందాబాద్, పాకిస్థాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ టపాసులు కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ పాక్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను కూల్చడం ద్వారా భారతసైన్యం సత్తా ఏమిటో ప్రపంచ దేశాలకు మరోసారి తెలిసి వచ్చిందన్నారు. శత్రుదేశం తేరుకుని ఏం జరుగుతుందో తెలుసుకునే లోగానే పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి మట్టిలో కలిపారని కొనియాడారు. దేశంలో ఉంటున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన వారిని గుర్తించి తిరిగి వారి దేశాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, బండారు కేదార్‌నాథ్, కొత్త సాంబశివరావు, ఊటుకూరు సత్యనారాయణ, గోనెల సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు



నిర్వాహకులను సన్మానిస్తున్న వీరభద్రస్వామి

శనగపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని శనగపాడులో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో కందిమల్లయ్యపల్లిలోని మఠం నుంచి వచ్చిన నొస్సం వీరభద్రస్వామి ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శిలాశాసనం, వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ, మాతా ఈశ్వరీదేవి పంచలోహ విగ్రహాలను ఆవిష్కరించారు.

ఆత్మీయ కలయిక..

దేశ, విదేశాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన శనగపాటి వంశస్తులు ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలాంటి ఆత్మీయ కలయికలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ శనగపాటి బ్రహ్మానందం, నిర్వాహకులు రమేష్, శనగపాటి వీరేశలింగాచారి, వేల్పూరి శ్రీనివాసరావు, వి.లింగం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావును సత్కరిస్తున్న షహనాజ్ బేగం, నాయకులు

నందిగామ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పదవులు పొందిన నేతలు పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సూచించారు. మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన షేక్ షహనాజ్ బేగం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావును మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించారంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో షేక్ ఫయాజ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం సర్పంచ్ పుల్లారావు మృతి



మల్కాపురం(జగ్గయ్యపేట): మల్కాపురం గ్రామ సర్పంచ్ ఆంబోజి పుల్లారావు అలియాస్ జాన్ (45) బుధవారం మృతిచెందారు. కొద్దిరోజుల కిందట ఆయన అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పుల్లారావు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికలలో పుల్లారావు భార్య ఆంబోజి మణి సర్పంచ్‌గా విజయం సాధించారు. అయితే ఏడాది లోపే అనారోగ్యంతో ఆమె మృతి చెందడంతో ఆస్థానంలో పుల్లారావును ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. పుల్లారావు కూడా అనారోగ్యానికి గురై మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుమున్నాయి. మృతుడికి తల్లి, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యోగా టీచర్లకు సత్కారం



జగ్గయ్యపేటఅర్బన్: గతనెల ఏడోతేదీన అరకులో నిర్వహించిన 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసే కార్యక్రమంలో పాల్గొని వరల్డ్ రికార్డు సాధించిన యోగా టీచర్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) బుధవారం అభినందించారు. అరకులో జరిగిన ఈ కార్యక్రమంలో పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటకు చెందిన సిరిపిరెడ్డి లీలావతి, కొనకంచి గ్రామానికి చెందిన కన్నేటి అశ్విని పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వారు ఎమ్మెల్యేను కలువగా, ఆయన వారిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువులు కరణం ఉగేంద్రపిళ్లై పాల్గొన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు



చౌటపల్లిలో చెరువు మట్టిని ట్రాక్టర్లకు లోడు చేస్తున్న ప్రొక్లెయిన్



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

వీరులపాడు: మండలంలోని చౌటపల్లి గ్రామంలోని చిన్న చెరువు నుంచి అక్రమార్కులు మట్టి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రొక్లెయిన్‌లతో తవ్వుతూ నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని పక్క మండలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని అవసరాన్ని బట్టి రూ. 600ల నుంచి వెయ్యి వరకు విక్రయిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. మూడు రోజుల నుంచి విచ్చలవిడిగా ఈ మట్టి తోలకాలు సాగుతున్నా ఇరిగేషన్, సంబంధిత శాఖాధికారులు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులో పెద్దపెద్ద గుంతలు తవ్వుతూ మట్టిని తరలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్టవేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రాజేష్‌ను వివరణ కోరగా మట్టి తోలకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. చౌటపల్లి చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలు



నందిగామలో ప్రత్యేకాలంకరణలో వాసవీ మాత



కంచికచర్లలో కలశాలను తీసుకువస్తున్న భక్తులు

నందిగామరూరల్: పట్టణంలోని శ్రీపురంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో వాసవీ మాత జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు మణికంఠ పాండే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. సుప్రభాత సేవ, గణపతి పూజ, అష్టోత్తర కలశ స్నాపన, 108 కలశాలతో సుగంధ ద్రవ్యాలతో వాసవీమాత మూలవరులకు తిరువంజనం, కుంకుమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్షమల్లెలార్చన జరిపించారు. రాత్రికి లలితా విష్ణుజ్ఞాన వాహిని మహిళా మండలి సభ్యులతో లలితా విష్ణు పారాయణ, భక్తిగీతాలాపన, పవళింపు సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మారం వెంకటేశ్వరరావు, వనమా బుల్లెబ్బాయి, ఊటుకూరు వెంకట సత్యనారాయణ గుప్త, నకిరికంటి నరేష్, పారేపల్లి సాయిబాబు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

108 కలశాలతో అభిషేకం..

కంచికచర్ల : స్థానిక ఆర్యవైశ్య సంఘం, వాసవి యువసేన ఆధ్వర్యంలో బుధవారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు తెల్లవారుజామున 108 కలశాలను తీసుకువచ్చి అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, లలితా సహస్రనామం, విష్ణు సహస్ర పారాయణం, అష్టోత్తర అభిషేకాలు, మహన్యాస పూర్వక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, వాసవి యువసేన నాయకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం నిర్ణయించాలని వినతి



జగ్గయ్యపేట అర్బన్: ఈ ఏడాది మార్చి 24వతేదీ రాత్రి సాయి తిరుమలగిరి కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన మిర్చి.. అపరాలకు సంబంధించిన నష్టపరిహారాన్ని నిర్ణయించాలని కోల్డ్ స్టోరేజ్ ప్రతినిధులు, మార్కెటింగ్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా బుధవారం కోల్డ్ స్టోరేజ్ ప్రతినిధులు రావూరి శ్రీనివాసరావు, హరి నరసింహారావు తదితరులు మార్కెటింగ్ ఏడీఏ మంగమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ కోల్డ్‌స్టోరేజ్‌లో 235 మంది రైతులకు చెందిన మిర్చి, అపరాలు నిల్వలు ఉన్నాయని, ప్రమాదం సంభవించడంతో సరుకంతా కాలిపోయిందన్నారు. 2023-24కు సంబంధించిన పాత సరుకు కూడా నిల్వ ఉందన్నారు. ఆ సరుకుకు కాలిపోయిన రోజున ఉన్న ధర ప్రకారం నష్టపరిహారాన్ని నిర్ధారించాలని కోరారు.

[illegible]

ప్రకటన

[illegible]

ఆపత్కాలంలో అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ



ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తున్న అధికారులు

నందిగామటౌన్: అగ్ని ప్రమాదాలు, వరదలు, ఇతర విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్డీఓ కె.బాలకృష్ణ సూచించారు. పట్టణంలోని గాంధీ సెంటరులో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించిన సమయంలో కంగారు పడకుండా ప్రమాదం నుంచి బయటపడే మార్గాలను అన్వేషించాలన్నారు. ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు జరిగితే 101నంబరుకు ఫోన్‌చేయాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఫైర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.